క్లుప్తంగా

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న సర్పంచ్ వాణీసీతారాం

ఆమదాలవలస: గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజలు తోడ్పాటు అందించాలని తొగారం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం అన్నారు. మంగళవారం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామ సభలో మాట్లాడారు. స్థానిక సుపరిపాలన ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా పలు వర్గాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు చొరవ చూపాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మినేని వేణు, పార్టీ కార్యకర్తలు, ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత సింగుపురం



ట్రోఫీని అందుకుంటున్న సింగుపురం జట్టు

పొందూరు. స్థానిక కబడ్డీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం మండలంలోని సింగుపురం జట్టు విజేతగా నిలిచింది. సోమవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీలో కొర్లకోటపై సింగుపురం జట్టు గెలిచింది. సింగుపురం జట్టుకు ట్రోఫీతోపాటు రూ.15 వేలు నగదు, కొర్లకోట జట్టుకు రూ.10 వేల నగదు, మూడో స్థానంలో నిలిచిన పొందూరు జట్టుకు రూ.7 వేల నగదు అందజేశారు. ఎంపీటీసీ అనకాపల్లి వాణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎ.చినరంగ, యంగ్ స్టార్ యూత్ క్లబ్ అధ్యక్షుడు కె.శాంతారాం బహుమతులను అందజేశారు.

వీఓఏల నిరసన



నిరసన తెలియజేస్తున్న వీఓఏలు

కొత్తూరు: తమకు ఆరు నెలల నుంచి బకాయి పడిన వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వీఓఏలు మంగళవారం నిరసన తెలియజేశారు. మండలంలోని వసప గ్రామంలో గల సామాజిక భవనంలో మండల స్థాయి వీఓఏల సమావేశాన్ని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. వీఓఏల సమస్యలతోపాటు పలు డిమాండ్లపై చర్చించారు. వీఓఏలపై వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలన్నారు. గ్రామైఖ్య సంఘాల కుదింపును విరమించుకోవాలని కోరారు. గొట్టిపల్లి వీఓఏను విధుల్లోకి తీసుకోవాలన్నారు. మండల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, బాలామణి తదితరులు పాల్గొన్నారు.

అక్కడ సిబ్బందే.. వైద్యులు



సారవకోట పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సారవకోట: పీహెచ్‌సీలలో పనిచేస్తున్న వైద్యులు ప్రస్తుతం సమ్మెలో ఉన్నారు. సారవకోట, బొంతు పీహెచ్‌సీలలో మంగళవారం వైద్య సిబ్బందే సేవలందించారు. వైద్యుల రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు అత్యవసర సమయాలలో మాత్రమే వైద్యులు అందుబాటులో ఉంటున్నారు తప్ప.. ఓపీ చూడటం లేదు. జాతీయ నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలోనూ వైద్యులు పాల్గొనలేదు.

మెలకువలు పాటించాలి

హిరమండలం: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మెలకువలు పాటించి ఉత్తమ విద్యా బోధన చేయాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఈ ఏడాది ఎనిమిది ప్రైమరీ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించగా.. ప్రస్తుతం రెండోవి నిర్వహించడం జరుగుతుందన్నారు.

అన్నసమారాధన



అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కొత్తూరు: మండల కేంద్రంలోని అల్లు, దేవర, చోడవరపు వీధుల్లోని వినాయక విగ్రహాలను మంగళవారం ఊరేగించి నిమజ్జనం చేశారు. ఆయా వీధుల్లో అన్నప్రసాద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పేరుకే మినీ రిజర్వాయర్



కొత్తకోట మినీరిజర్వాయర్



బలహీనంగా ఉన్న రిజర్వాయర్ గట్టు

- నిండా గుర్రపుడెక్క
- పూడికపోయిన కాలువ
- ఖరీఫ్, రబీ పంటలకు అందని సాగునీరు

సరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట గ్రామం ఎగువ భాగాన 175 ఎకరాల విస్తీర్ణంలో గల పెద్దచెరువు చుట్టూ గల భౌగోళిక స్థితిగతులను అంచనా వేసిన వంశధార అధికారులు మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించుకున్నారు. 2006లో వంశధార కుడి ప్రధాన కాలువ నిర్మాణ సమయంలో సుమారు రూ.43 లక్షల అంచనా వ్యయాన్ని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు నిధులు మంజూరు చేశారు. ఈ రిజర్వాయర్‌ను అభివృద్ధి చేసిన తరువాత వంశధార కాలువ ఇన్‌ఫ్లో నుంచి వచ్చిన సాగునీరు వృథాగా పోకుండా నిల్వ చేసి అవుట్‌ఫ్లో ద్వారా 18 గ్రామాలకు చెందిన 1200 ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్‌లో నీరు అందించేందుకు నిర్ణయించారు.

అరకొరగా పనులు..

చెరువును మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దాలంటే ముందుగా నీటిని స్టోరేజీ చేసేందుకు గట్టును బలపరచాలి. గట్టును అభివృద్ధి చేసేందుకు రూ.15లక్షలతో రివిట్‌మెంట్ ఏర్పాటు చేశారు. పనులు చేసే సమయంలో నాణ్యత పాటించకపోవడం వల్ల రివిట్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన బండరాళ్లు బయటకు రావడంతో గట్టు పూర్తిగా బలహీనపడింది.

మైదానాన్ని తలపిస్తున్న మినీ రిజర్వాయర్..

రిజర్వాయర్‌లో నీటిని స్టోరేజ్ చేయాలంటే సుమారు 10 అడుగులు లోతు ఉండాలి. ఏళ్ల తరబడి రిజర్వాయర్‌లో పూడిక తీయలేదు. పూడిక పేరుకపోయి రిజర్వాయర్ మైదానాన్ని తలపిస్తుంది. సాగునీరు నిల్వ చేయక వృథాగా బయటకు పోతుంది. అత్యవసర పరిస్థితుల్లో రైతులు చుక్క నీటి కోసం కొట్లాడుకొంటున్నారు.

విస్తరించిన గుర్రపుడెక్క..

రిజర్వాయర్ నిర్వహణ విషయంలో అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడం వల్ల సుమారు 50 ఎకరాల్లో గుర్రపుడెక్క విస్తరించింది. గుర్రపు డెక్క అధికంగా పేరుకుపోవడం వల్ల అవుట్‌ఫ్లో ద్వారా సాగునీరు ప్రవహించే సమయంలో ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీరు అందాల్సిన గ్రామాలు..

కొత్తకోట రిజర్వాయర్ నుంచి కొత్తకోట, డకరవలస, నక్కలపేట, బురిడివలస, రావివలస, చినవెంకటాపురం, షళంత్రి, పెద్దపాలెం, కొండవలస, రొట్టవలస, వీరమల్లిపేట తదితర గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందించాలి. రిజర్వాయర్ నిర్వహణలో లోపాల వల్ల సాగునీటికి ఆయా గ్రామాల రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

అధికారులు పట్టించుకోవడంలేదు



కొత్తకోట రిజర్వాయర్ నిర్వహణ విషయంలో అధికారులు పూర్తిగా పట్టించుకోవడంలేదు. ముఖ్యంగా లష్కర్ వ్యవస్థ లేకపోవడం వల్ల, షట్టర్ల మరమ్మతులకు గురైన సమయంలో, సాగునీటి విడుదల సమయంలో రైతులు నానా కష్టాలు పడుతున్నారు. రెండు పంటలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– సురవరపు నాగేశ్వరరావు, రైతు, కొత్తకోట

శివారు భూములకు సాగునీరు అందడంలేదు



రిజర్వాయర్ ద్వారా శివారు భూములకు చుక్కనీరు అందాలంటే గగనమవుతుంది. రిజర్వాయర్‌లో ఉన్న పూడికను తొలగించాలి. పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడం వల్ల ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీటి కష్టాలు పడుతున్నాం. బలహీనంగా ఉన్న గట్టను బాగు చేయాలి.

– ఎస్.హరి, రైతు, పెదవెంకటాపురం

పేదల చదువుపై చంద్రబాబు కక్ష

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: పేదల చదువులపై సీఎం చంద్రబాబు కక్షగట్టారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పేద పిల్లలకు ఉన్నత చదువులు దండగ అని భావించి, ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్‌తో కాకుండా పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. మరోవైపు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు రాష్ట్రానికి రాకుండా చంద్రబాబు అడ్డుకున్నారని వివరించారు. పేదింటి పిల్లలకు మెడికల్ చదువు లేకుండా చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. పాఠశాలల్లో నాడు–నేడుతో సకల సదుపాయాలు కల్పించారని, డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చి బైలింగ్వల్ విధానంలో పాఠ్యపుస్తకాలు ముద్రించి పంపిణీ చేశారన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను బోధించేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఇంగ్లిష్ మీడియం, రోజుకో మెనూతో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, విదేశీ చదువులు.. ఇలా అన్ని రకాలుగా పేదల పక్షాన నిలిచారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత పేదింటి పిల్లలకు ప్రభుత్వ చదువులకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఆయనకు కాసులు కురిపిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం, సూపర్ సిక్స్ పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

108 రకాలతో నైవేద్యం



పోలాకి మండలంలోని బెలమర బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద 108 రకాల వంటలు, వివిధ పండ్లతో మహానైవేద్యం ఏర్పాటు చేశారు. మంగళవారం నిమజ్జన కార్యక్రమం నేపథ్యంలో ప్రతిఏటా ఆఖరి రోజు ఇలా ప్రత్యేకంగా నైవేద్యంపెట్టి, ప్రసాదాలను భక్తులకు అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

– పోలాకి

ఘనంగా విశ్వకర్మ జయంత్యుత్సవాలు



నరసన్నపేట: ఊరేగింపుగా విశ్వకర్మ విగ్రహాన్ని తీసుకువెళ్తున్న స్వర్ణకార సంఘం ప్రతినిధులు



హిరమండలం: బ్యారేజీ సెంటర్‌లో విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండల కేంద్రంలో విశ్వకర్మ జయంత్యుత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగింపుగా మండపానికి తీసుకువచ్చారు. మండలంలోని స్వర్ణకారులు, విశ్వబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బండి వీధి స్వర్ణకార భవనంలో స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, తెలగ వీధిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు

సారవకోట: మండలంలోని పలు గ్రామాలలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ విగ్రహానికి శోభయాత్ర నిర్వహించారు. చీడిపూడి, బొంతు గ్రామాలలో విశ్వకర్మ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేపట్టారు.

హిరమండలం: స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని అలికాం–బత్తిలి ప్రధాన రహదారిలో ఊరేగించారు. బ్యారేజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో విశ్వకర్మ విగ్రహాన్ని నెలకొల్పి ప్రత్యేక పూజలు చేశారు.

పాతపట్నం: స్థానిక రైల్వే ట్రాక్ సమీపంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు కొత్తపల్లి రవిబాబు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సారవకోట: విశ్వకర్మ విగ్రహానికి శోభయాత్ర నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు



పాతపట్నం: విశ్వకర్మ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

రూ.లక్ష విరాళం



చిన్నారులతో శ్రీమృత్యుంజేశ్వర ఫౌండేషన్ సభ్యులు

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న లవ్లీ చిల్డ్రన్ హోమ్‌కు పాతపట్నానికి చెందిన శ్రీమృత్యుంజేశ్వర ఫౌండేషన్ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఫౌండేషన్ నాలుగో వార్షికోత్సం సందర్భంగా లవ్లీ చిల్డ్రన్ హోమ్ అభివృద్ధికి, చిన్నారుల సేవకు నగదును అందజేశామని నీలపు మధు, ధనలక్ష్మి తెలిపారు.

ఆలయ సభ్యుల మధ్య వివాదం

పొందూరు: మండల కేంద్రంలోని కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యుల మధ్య మంగళవారం వివాదం చెలరేగింది. భక్తులు అందించే విరాళాల విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నారని ప్రస్తుత ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాజారావు, వెంకటరావు విమర్శించారు. గతంలోనూ పాత కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. పాత కార్యవర్గం, కొత్త కార్యవర్గం మధ్య వివాదాలు ముదిరాయి. ఆలయంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాత కార్యవర్గ సభ్యులు నూతన కార్యవర్గ సభ్యులపై దాడికి ప్రయత్నించారు. స్థానిక నాయకులు కలుగుజేసుకుని వివాదాన్ని తాత్కాలికంగా సద్దుమణిగేలా చేశారు.

నులిపురుగుల మాత్రల పంపిణీ

నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ చిన్నారులకు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మంగళవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. 19 ఏళ్ల లోపు ఉన్నవారికి మాత్రలను అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: జూనియర్ కాలేజ్‌లో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



నరసన్నపేట: ఉర్లాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది



ఎల్.ఎన్.పేట: కరకవలస జెడ్పీహెచ్‌ఎస్‌లో మాత్రలను మింగిస్తున్న హెచ్‌ఎం రామారావు, వైద్య సిబ్బంది



బూర్జ: బూర్జ జెడ్పీహెచ్‌ఎస్‌లో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



పొందూరు: జూనియర్ కళాశాల విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు



మెళియాపుట్టి: చాపర ఎంపీయూపీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



కొత్తూరు: కొత్తూరులో విద్యార్థులతో మాత్రలు వేయిస్తున్న వైద్య సిబ్బంది



పాతపట్నం: కొరసవాడ హైస్కూల్‌లో నులిపురుగుల నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు

రోగులకు పండ్ల పంపిణీ

పాతపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ లో రోగులకు బీజేపీ సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి అవరణలో మొక్కలు నాటారు. పెద్దలక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ నాయకుడు అన్నెపు ఉమామహేశ్వరరావు కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. పాతపట్నం శ్రీనీలమణిదుర్గ ఆలయంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుక్క శ్రీకాంత్ రెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



నరసన్నపేట: వంద పడకల ఆస్పత్రి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య, పారిశుధ్య సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని అన్ని గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో మంగళవారం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేసి, మొక్కలు నాటారు. అవగాహన ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పారిశుధ్య, పంచాయతీ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు



నరసన్నపేట: పంచాయతీ కార్యాలయం వద్ద ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



సరుబుజ్జిలి: కొత్తకోటలో మొక్కలు నాటిన సర్పంచ్ జగదీశ్వరరావు



హిరమండలం: అవలంగి పాఠశాల ఆవరణంలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు



ఆమదాలవలస: రామలింగేశ్వర పుష్కరిణి ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, సచివాలయ, మున్సిపల్, మెప్మా సిబ్బంది



సారవకోట: అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



మెళియాపుట్టి: మండల కేంద్రంలో మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



జలుమూరు: చల్లవానిపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కొత్తూరు: పాత తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

నేడు, రేపు మండల స్థాయి ఆటల పోటీలు

నరసన్నపేట: స్కూల్ గేమ్స్‌లో భాగంగా మండల స్థాయిలో బుధ, గురు వారాల్లో ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు మడపాం పీడీ లక్ష్మణరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మంగళవారం తెలిపారు. మండల స్థాయిలో ఉన్న అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొనాలన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. ఐదు విభాగాల్లో పోటీలు ఉంటాయని, బుధవారం బాలురు, గురువారం బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బూర్జ: మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలో గల పాలకొండ–శ్రీకాకుళం ప్రధాన రహదారిలో కొండపేట గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన నాస చిట్టయ్య మంగళవారం పొలం పనుల నిమిత్తం రహదారి పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నారు. పాలకొండ వైపు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ అతివేగంగా వెనుక వైపు నుంచి ఢీకొంది. ఎడమ చేయి, కుడి కాలు, తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే ఆటోలో పాలకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చిట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.ప్రవళిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.